# గోదారమ్మ-17

గోదారమ్మ అలాగే అన్నట్లుగా తలవూపి తన కధ చెప్పటం మొదలు పెట్టింది.

''మావారి స్నేహితుడొకడు ఏదో 'ఎగుమతులు – దిగుమతులు' వ్యాపారం చేయాలని అనుకుంటున్నట్లుగా చెప్పి, పార్టన ర్ గా చేరతారేమోనని అడిగాడు. ఆయనకూ ఆ వ్యాపారం చేయాలనిపించిందేమో, వూళ్ళో తనకి వచ్చిన భూములను అమ్మేసి తన వాటాగా పెట్టుబడి పెట్టారు.

ఆ తర్వాత అతనికి ఏదో సమస్యవచ్చి తన వాటాను అమ్మేయలనుకుంటున్నట్లుగా చెప్పేసరికి... మావారు 'బాగా జరుగుతోంది, లాభాలు వస్తున్నాయిగా' అనే ఉద్దేశ్యంతో తనే తీసుకుంటానని చెప్పారు. అలా ఆ వ్యాపారానికి మావారు ఒక్కరే అధిపతి అయ్యారు. అప్పటినుండీ రాత్రింబవళ్ళు ఆ వ్యాపారం కోసం కష్టపడి, అభివృద్ధి లోకి తీసుకువచ్చారు.

ఆ తర్వాత... పెద్ద అబ్బాయి కూడా చదువు పూర్తిచేసి తండ్రికి చేదోడుగా వ్యాపారంలో ఉండేసరికి ఆయనకు కొంత నిశ్చింత ఏర్పడింది. ఆ సమయంలోనే ఈ ప్రాంతానికి చెందిన ఒకాయన, పరంధామయ్య గారు, ఉద్యోగం కోసమంటూ వచ్చేసరికి, నేనూ కొంత ప్రోత్సాహంగా చెప్పటంతో ఆయనను తీసుకున్నారు. పరంధామయ్య గారు కుటుంబాన్ని మాత్రం వాళ్ళ ఊరులోనే ఉంచి, ఆయనొక్కరే ఉంటుండటంతో నేను తరచూ భోజనానికి పిలుస్తూండేదాన్ని. అలా ఆయనకు మా కుటుంబంతో బాగా చనువు ఏర్పడింది. మా వారు కూడా నమ్మకస్తుడైన ఉద్యోగిగా అనిపించటంతో అన్ని విషయాలూ, డబ్బు వ్యవహారాలతో సహా, ఆయనకే అప్పగించేవారు.

కానీ ఒకసారి ఏం జరిగిందో తెలుసా... వేరే దానిలో పెట్టుబడికీ, అందరికీ జీతాలు ఇవ్వటం అనే పనులకు గాను బ్యాంకునుండి కొంచెం పెద్ద మొత్తం తీసుకురమ్మని పరంధామయ్య గారినే పంపించారు. బ్యాంకు లావాదేవీలన్నీ ఆయనే చూస్తూండటం వలన ఆయనంటే బాగా గురి ఏర్పడింది!

అయితే ఆ సారి ఎందుకో ఆయన డబ్బుతో తిరిగి రాలేదు... ఆచూకీ కూడా తెలియలేదు. ఏం చేయాలో మావారికీ తోచలేదు. డబ్బు కన్నా స్నేహితుడిగా భావించిన ఆయన మోసం చెయ్యటాన్ని మా వారు జీర్ణించుకోలేకపోయారు. ఆ మనో వ్యధ ఆయనను కృంగదీసింది. కష్టాలన్నీ ఒంటిగా రావన్నట్లుగా అపుడే మావారికీ ఆరోగ్యంలో తేడా వచ్చింది! హార్ట్ ఎటాక్ అంటూ ఆయన చనిపోవటమూ జరిగింది....!'' గోదారమ్మ గొంతు బొంగురు పోవటంతో కొన్ని నిమిషాలు మౌనంగా ఉండిపోయింది.

సీత కూడా ఆ దుఃఖంలో పాలు పంచుకుంటున్నట్లు మౌనంగా ఉండిపోయి, తర్వాత ఆవిడ చేయి పట్టుకుని అనునయిస్తున్నట్లుగా... ''ఇది జరిగి చాలాకాలం అయినా మీరింకా ఆ జ్ఞాపకాలతో బాధపడుతున్నారంటే... మీ

మధ్య ఎంత అన్యోన్యత ఉండేదో నాకు అర్థం అవుతోందమ్మా... కానీ విధి నిర్ణయానికి మనం తలవొగ్గాల్సిందే... తప్పదు కదమ్మా....!'' అంది సీత ఓదార్పుగా ఆవిడ చేతిని మరింతగా నొక్కుతూ.

గోదారమ్మ తేరుకుని మళ్ళీ మొదలుపెడుతూ గొంతు సవరించుకుంది.

''అవును సీతా... మనం మార్చలేని నిర్ణయాలకు తలవొంచి సర్దుకుపోవాల్సిందే! అదే నా విషయంలోనూ జరిగింది.

ఏం జరిగినా... ఖర్మల్ని మాత్రం యధావిధిగా ఎదుర్కోవాల్సిందేకదా... ఏం చేయాలో తోచని స్థితిలో పెద్దబ్బాయి ఉన్నాడు. అప్పుడు నా నగల మూటను తీసుకెళ్ళి వాడికి అందించాను.

నేను పెళ్ళి తర్వాత అత్తవారింటికి వెళ్ళటానికి బట్టల్ని పెట్టిలో సర్దుకుంటున్నపుడు అమ్మ ఆ నగల్ని తీసుకువచ్చి ఓ పక్కగా పెట్టింది. అవన్నీ చిన్నప్పటినుండీ నా కోసం కొన్నవే... కొన్ని ఆ సమయంలోనూ కొనటం జరిగిందన్నమాట.

'ఇవన్నీ ఇపుడెందుకమ్మా' అంటూ నేను ఆశ్చర్యంగా అనేసరికి అమ్మ నిదానంగా జవాబుచెప్పింది. 'వాళ్ళు కట్నం అంటూ ఏమీ అడగలేదు. మీ నాన్నగారిదీ అదే పద్ధతి కాబట్టి ఆ విషయమే ప్రస్తావన రాలేదనుకో..... అయినా ఓ భాగ్యవంతుల ఇంటికి కోడలుగా వెళ్తున్నావు... ఆ పైన ఇవన్న నీవే కాబట్టి నీతోనే ఉండటం సమంజసం.' అని బలవంతంగా నాకిచ్చి పంపింది.

అలా ఆ నగలన్నీ తెచ్చానేగానీ వాటిని పెట్టుకోవటం పట్ల ఆసక్తి లేక అలాగే ఉండిపోయాయి.

'ఇవన్నీ అమ్మేయటమే మంచిది. తాకట్టు పెట్టటం లాంటిది అనవసరం' అని మా వాడికి చెప్పా.

''అలాగే చేద్దాంకానీ... నీకు కొన్ని అయినా అవసరానికి ఉంచు అమ్మా...'' అన్నాడు వాడు.

''ఇవన్నీ మా అమ్మవాళ్ళు ఇచ్చినవి. మీ నాన్న కొన్నవి  నా దగ్గర ఉన్నాయి గా... అయినా నేను వాటిని పెట్టుకోవటం అంటూ ఉండనప్పుడు, అవసరానికి అయినా ఉపయోగపడనియ్యి...'' అని అబ్బాయికి సర్ది చెప్పాను.

అయిష్టంగా ఉన్నా ఖర్చులన్నీ తట్టుకోవటానికి వాటిని ఉపయోగించక తప్పలేదు. బంగారం ధరలు బాగా పెరిగాయి కాబట్టి అవి బాగానే ఉపయోగపడ్డాయి.

''అమ్మా... నీ నగల వల్లే మనం నిలదొక్కుకోగలిగాం కాబట్టి, ఈ వ్యాపారానికి నువ్వే యజమానురాలివి సుమా...!'' అన్నాడు.

''ఇవి ఇలా ఉపయోగపడటం వలన మనం ఆపదను గట్టెక్కాంగానీ 'యజమాని' అనేమాట ఎందుకులే... ఎవరమైనా ఒకటేగా...!'' అన్నాను.

అలా ఆ గడ్డు సమయాన్ని గట్టెక్కాం. సరిగ్గా ఆరోజుల్లోనే ఒక విచిత్రం జరిగింది...!'' అంటూ గోదారమ్మ మాటలు ఆపేసింది.

''ఏమిటమ్మా.... ఆపేసారూ... ఆ తర్వాత...?'' అంది ఆత్రుతగా సీత.

ఆవిడ తన చేతివేలును ఎదురుగా చూపించటంతో సీత వెనుదిరిగి చూసింది. రామచంద్ర నిలబడి వున్నాడు!

''అదేమిటి... ఇపుడే రాలేనని చెప్పి వెళ్ళి అపుడే వచ్చేసారూ...'' అంటూ సీత లేచి నిలబడింది.

గోదారమ్మ ''ఈ కబుర్లకేంలే సీతా... ఎపుడైనా మరోసారి చెప్పుకోవచ్చు. రామచంద్ర ఎందుకు వచ్చాడో చూడు ముందు..'' అనటంతో సీత అతని దగ్గరకు వెళ్ళింది.

రామచంద్ర కి కొంచెం వెనుకగా నిలబడిన ఇద్దర్నీ చూసి సీత 'ఎవరు' అన్నట్లుగా కళ్లెగరవేసింది.

రామచంద్ర చిన్నగొంతుతో ''సీతా... వీళ్ళిద్దరూ పక్కవూరి వాళ్లు. ఇల్లు వెతుక్కునేవరకూ మన ఇంట్లో ఓ నాలుగు రోజులు ఉంటారు...!'' అన్నాడు.

సీత ఒక క్షణం ఆశ్చర్యంగా చూసి వెంటనే తేరుకుని ''రండి...'' అంటూ వాళ్ళని లోపలికి పిలిచి కూర్చోబెట్టింది.

ఈ లోపుగా అతను గోదారమ్మ దగ్గరకు వచ్చి విషయం వివరించాడు.

''పెద్దమ్మగారూ... వీళ్ళిద్దరివీ వేరు వేరు కులాలు. ఇళ్ళు దగ్గరే ఉండటం వలన పరిచయం పెరిగి ఇద్దరూ ఇష్టపడి పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. రెండేళ్ళ క్రితం ఇంట్లో చెప్పారు... కానీ ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు... అభ్యంతరం చెప్పారు. మామూలు కథే అనుకోండి. అయితే అప్పటికి ఇద్దరి చదువులూ పూర్తవలేదు. నేనే వాళ్ళకి 'చదువులు పూర్తిచేసి, ఆర్థికంగా ఎవరిమీదా ఆదరాపడకుండా ఉద్యోగాల్లో చేరాకనే పెళ్ళి అభిప్రాయం అమలు చేయవచ్చును' అని నచ్చ చెప్పాను. అలాగే వాళ్ళ పెద్దవాళ్ళకీ చెప్పి ఒప్పించాను. 'వాళ్ళ చదువులు పూర్తయి, ఏవో ఉద్యోగాల్లో కుదురుకునే వరకూ పెళ్ళి మాట తలపెట్టకండి. ఓ రెండేళ్ళు అలా ఆగటం వలన వాళ్ళ అభిప్రాయాల్లో మార్పు వచ్చి మీ మాటే వినే అవకాశమూ ఉంటుంది!' అని చెప్పటంతో ఇద్దరి కుటుంబాల్లోని వాళ్ళూ సరేనన్నారు.

ఈ అబ్బాయి శివానంద్ ఈ మధ్యనే మా ఆఫీసులో చేరాడు. అమ్మాయికీ లక్కీగా ఈ ఊళ్ళోనే ఉద్యోగం వచ్చింది. కానీ పెద్దవాళ్ళకి కులాల పట్టింపు ఏ మాత్రం తగ్గలేదు. 'ప్రాణాలు తీస్తాం, లేదా తీసుకుంటాం'గానీ పెళ్ళికి మాత్రం ఒప్పుకోమని భీష్మించుకుని కూర్చున్నారు. అలా పిల్లల అభిప్రాయాల్లోనూ...పెద్ద అభిప్రాయాల్లోనూ తేడా రాలేదు. నాకు ఏం చేయాలో పాలుపోక, వీళ్ళిద్దరికీ మాట ఇచ్చాను కనుక, నేనే పెళ్ళి చేద్దామని నిర్ణయించుకుని వెంటబెట్టుకు వచ్చాను. మనింట్లో ఉండి, ఇల్లు దొరకగానే గుళ్ళో పెళ్ళి చేసుకుని వెళ్ళి పోతారు...! అన్నట్లు ఇంకోమాట... ఇద్దరూ

ఒక వారం సెలువు పెట్టారు!" ఇదంతా అతను చెబుతూండగానే గుమ్మం దగ్గిర నిలబడి విన్న సీత అతన్ని వరండాలోకి రమ్మని చేత్తో సైగ చేసి మెల్లగా పిలిచింది.

అతను లేచి రాగానే చాలా మెల్లగా గుసగుసగా అంది ''విషయం అంతా విన్నాలే. మీరు చేసిన పనిని తప్పు పట్టటం లేదు గానీ... ఇవి సెలాఖరు రోజులు కదా... ఎలా...?''

''అంటే...?'' రామచంద్ర అంతే సెమ్మదిగా అడిగాడు.

''వీళ్ళు చేసుకునే పెళ్ళికి ఎంత తక్కువగా ఖర్చుపెట్టినా ఏవో కొన్ని ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయిగా. ఆపైన ఇల్లు దొరికే వరకూ మనం చూడాలంటే.... మన ఇద్దరికీ జీతాలు వచ్చేవరకూ  కొంచెం కష్టమౌతుందేమో...!''

సీత తన సందేహం వెలిబుచ్చింది.

రామచంద్ర చాలా మెల్లగా సీతకి ధైర్యం చెప్పాడు. ''మరేం ఫర్వాలేదు సీతా... నువ్వేం కంగారు పడకు. నేను రేపు ఏదో మార్గం చూస్తాగా. ముందు వాళ్ళతో మాట్లాడి... భోజనాల ఏర్పాట్లు చూడు. ఇప్పటికి ఫర్వాలేదు కదా...!''

సీత 'అలాగే' అన్నట్లు తలవూపి లోపలకు వెళ్ళింది.

వాళ్ళిద్దరూ కొంచెం దూరంగా వరండాలో నిలబడి ఎంత సెమ్మదిగా మాట్లాడుకున్నా అవన్నీ గోదారమ్మకు కొంచెంగా వినబడి విషయం అర్ధమైంది.

మర్నాడు ఆవిడ సీత చేతిలో కొంత డబ్బు పెట్టింది. దాంతో సీత ఆవిడవైపు విస్మయంగా చూసి ''అమ్మా... మీరు నిన్న నావీ, రామచంద్రవీ మాటలు విన్నారు కదూ...?''

''వినాలనుకుని వింటే... తప్పుకావచ్చునేమోగానీ, వినబడితే అదేం నేరం కాదుగా! అయినా నన్ను మీ కుటుంబంలోని వ్యక్తిగా అనుకుంటే... సమస్యల్ని నాతో చెప్పకుండా దాచాలని అనుకోవటమే తప్పు...! అని నా అభిప్రాయం." అంది నిష్టూరంగా.

''అది కాదమ్మా...! ఇప్పటికే మీరు ఇంట్లోకి అవసరమైనవి కొంటూ చాలానే ఖర్చుచేస్తున్నారు! మేం ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నా... సెలాఖరు వచ్చేసరికి ఇలాంటి పరిస్థితి రావటం పట్ల నాకు చాలా సిగ్గుగా ఉంది'' అంది సీత తలవంచుకునే మాట్లాడుతూ.

ఒక క్షణం తర్వాత సీత ఏదో ఆలోచిస్తున్నట్లుగా గోదారమ్మతో చెప్పింది.

''అమ్మా... ఆ మధ్య మీరొకసారి చెప్పారు.... గుర్తుందా...? డబ్బు ఉండటమనేది మనకు చాలా భరోసా ఇస్తుందనేది. నాకిపుడు ఓ ఆలోచన వచ్చింది. ఇద్దరమూ ఉద్యోగాలు చేస్తున్నా పొదుపు చేయటమనేది కుదరటం లేదు.

హఠాత్తుగా ఏ ఖర్చు వచ్చినా తట్టుకోవటానికి వీలుగా ఎంతో కొంత ఆదాచేయాలి! ఇకనుండీ ప్రతీనెల కొంతమొత్తాన్ని ఇద్దరమూ కలిసి బ్యాంకులో వేసి దాన్ని కదపకుండా ఉంచాలని నిర్ణయం తీసుకున్నా....!''

సీత మాటలు చెబుతూండగానే గోదారమ్మ అందుకుని చెప్పింది. ''అవును సీతా... అది చాలా మంచి నిర్ణయం. మీరు మాత్రమే కాదు... ఈ నిర్ణయాన్ని వూరంతా పాటించేట్లు ప్రచారమూ చేద్దాం! రోజువారీ సంపాదన ఉన్నవాళ్ళు, నెలవారీ జీతాలందుకున్నేవాళ్ళు అందరూ తమ సంపాదనలో నుండి ఎంతోకొంత, చిన్న మొత్తమైనా సరే వేరేగా పెట్టాలి! ఇలాంటి వాటికి ప్రభుత్వ పథకాలూ కొన్ని ఉంటాయనుకుంటా. సరిగ్గా తెలియదు కాబట్టి, వాటిగురించీ పూర్తిగా తెలుసుకుందాం.

దీనికి 'మహాలక్ష్మి పొదుపు పథకం'లాంటి పేరేదో పెట్టి మనమే ముందుగా ప్రారంభించేద్దాం! సరేనా...!

అవసరాలకు ఇలాంటి ఆదా ఎంత ఆదుకుంటుందో అర్థమయ్యాక, అందరూ తప్పకుండా ఆచరిస్తారనే నమ్మకం నాకుంది!"

''అవునమ్మా... మీ ఆలోచన బావుంది. మనం పొదుపు చేయటమే కాదు, అందరూ ఈ సలహా పాటించేట్లుగా ప్రచారమూ చేద్దాం! ఇంకో సలహా అమ్మా...! మీరు కూడా మీ దగ్గరున్నది అంతా ఖర్చు పెట్టేయకండి. మీ కోసం కొంత ఉండాలిగా...? మా కోసమూ మీరెక్కువగా ఖర్చు చేసేస్తున్నారనిపిస్తోంది...!'' అంది సీత.

ఆవిడ చిరునవ్వుతో సీతవైపు చూసింది.

''డబ్బు మనిషికి ఆసరాగా ఉంటుంది. భరోసానిస్తుందన్నది నిజమే అయినా ఎంత సంపద ఉన్నా ఆత్మీయులు లేకపోతే మాత్రం ఆనందంగా ఉండలేం! ఇది మాత్రం నిజం సీతా!''

అపుడే అటుగా వచ్చిన రామచంద్ర ''ఏమిటో మీ ఇద్దరూ అంత సీరియస్ గా మాట్లాడుకుంటున్నారూ...?'' అంటూ ఆరా తీశాడు.

గోదారమ్మ జవాబు చెప్పింది. ''ఏం లేదు రామచంద్రా... డబ్బు గురించేలే, మేం చర్చించుకుంటున్నాం. డబ్బుతో కొన్ని సౌకర్యాలు ఏర్పడే మాట నిజమే, అందుకోసం డబ్బు అవసరమేగానీ అసలైన ఆనందం మాత్రం ఆత్మీయుల వలనే కలుగుతుందని చెబుతున్నా...!''

''అవునండీ... సీత డబ్బు అవసరం అని రాత్రి చెప్పింది. పొద్దున్నే ఇక ఈ నెల నుండీ ఇద్దరం, ఎంతో కొంత పొదుపు చేయాలనుకుంటున్న తన నిర్ణయం గురించీ చెప్పింది. అది నిజమే అనుకోండీ కానీ... ఇప్పటికి మాత్రం మిమ్మల్నే ఈ విషయంగా ఏం చేయాలీ, ఏమిటీ అని సలహా అడగాలని అనుకుంటున్నా....!''

రామచంద్ర మాటలతో ఆవిడ మొహంలోకి కొంచెం గర్వంతో కూడిన సంతృప్తి వచ్చింది. సీతవైపు ''విన్నావా...' అన్నట్లుగా చూసి ఆవిడ చెప్పింది.

''చూడు.... సీతా... రామచంద్ర అయినా నన్ను ఈ కుటుంబానికి పెద్దదిక్కుగా అంగీకరించి సమస్యని నాతో చెప్పాలనుకున్నాడు...'' అని కొంచెం నిష్ఠూరంతో కూడిన స్వరంతో మళ్ళీ అందావిడ. ''నువ్వేమో నాకు తెలియకుండా దాచాలనుకున్నావు...!''

సీత కొంచెం తత్తరపాటుతో ''అది... అది....'' అంటూ నసుగుతోంటే... ఆవిడ నవ్వేసింది.

''సీతా... నిన్ను నేను వేరేగా అపార్థం చేసుకోలేదులే... నాకు తెలుసు... నువ్వు నాగురించి నాకంటే ఎక్కువగా ఆలోచిస్తావని! ఇంకో మాట చెప్పనా... నాకు ఎప్పుడూ 'నువ్వు, నేను వేరు వేరు మనుష్యులం కాదు.. ఒకరమే కాబోలూ' అనీ అనిపిస్తుంది. తెలుసా... ఎందుకంటే... నువ్వేం చెప్పినా, చేసినా నా మనసులోని మాటలే నీ ద్వారా వింటున్నట్లుగా ఉంటుంది మరి....!''

ఆవిడ ఇచ్చిన వివరణకి సీత మోము వికసించింది, ఆవిడ వైపు ఆనందంగా చూసింది.

సీత రామచంద్రకి తన చేతిలోని డబ్బును చూపించి గోదారమ్మగారే ఇచ్చారన్నట్లుగా చెప్పింది సైగలతోనే.

అతను ఆనందంగా చెప్పాడు ''నీకు నేనేదో విధంగా ఏర్పాటు చేస్తానని చెప్పా కదా, ఇదే అది అనుకుందాం...!''

ముగ్గురూ చిన్నగా నవ్వుకున్నారు.

వెంటనే రామచంద్ర " సీతా, మనం ఈ డబ్బు అప్పుగానే భావిద్దాం. పెద్దమ్మ గారికి మనం ఎన్నో విధాలుగా ఋణపడి పోయాం...మొదట ఆవిడ అప్పు తీర్చాకే మన పొదుపు పథకం ప్రారంభిద్దాం. ఏమంటావు?" అన్నాడు చలించిపోయినట్లుగా.

సీత కూడా ఆనందంగా వెంటనే తలవూపుతూ.. "చాలా మంచి మాట చెప్పారు రామచంద్రా....తప్పకుండా అలానే చేద్దాం. ఇప్పుడే పెద్దమ్మా, నేనూ ఊరందరితో కూడా ఇలా పొదుపు చేయించే మహాలక్ష్మి పొదుపు పథకం ప్రారంభిద్దాం అనుకున్నాం' తెలుసా ! అంది ఉద్వేగంగా.

గోదారమ్మ సంతృప్తిగా నిండు గోదావరిలా నవ్వింది.

* * *